క్లుప్తంగా

## ప్రజా సంక్షేమానికి కృషి



**అలంపూర్:** నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. అయిజ మండలం మేడికొండ గ్రామానికి చెందిన రంగమ్మకు రూ.12 వేలు, అయిజ మున్సిపాటికి చెందిన హరిజన రామక్కకు రూ. 24 వేలు విలువైన చెక్కు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కరుణసింహారెడ్డి, మురళీగౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

## పశువులకు టీకాలు తప్పనిసరి



**శాంతినగర్:** పశువులను సీజనల్ వ్యాధుల బారి నుంచి తప్పించేందుకు ముందస్తు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని శాంతినగర్ పశువైద్యశాల డాక్టర్ స్వరూపరాణి రైతులకు సూచించారు. వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం గ్రామంలో శాంతినగర్ పశువైద్యశాల సిబ్బంది పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు మంగళవారం వేశారు. ఈ సందర్భంగా రైతులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మొత్తం 462 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరప్రసాద్, లతీఫ్, బుచ్చమ్మ, పాలాగు, వెంకటమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

## నేడు రెవెన్యూ సదస్సులు

**కేటీదొడ్డి:** మండలంలోని పాతపాలెం, వెంకటాపురం గ్రామాల్లో బుధవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగించుకోవాలని కోరారు.

## మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

**మానవపాడు:** మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, వారు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రకాంత్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. రోడ్డు నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



**ధరూరు:** ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే సహించేది లేదని మండల విద్యాధికారి రవీంద్రబాబు అన్నారు. మండల పరిధిలోని దోర్నాల ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. రికార్డులు, హాజరు రిజిస్టర్లలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికరమైన ఆహారం అందించాలన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## పత్తి విత్తనాల పట్టివేత



**అయిజ:** ప్రభుత్వ అనుమతి లేని పత్తి విత్తనాలను మంగళవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కేశవరం గ్రామంలో తెలుగు వెంకటేష్ అనే వ్యక్తి అనుమతి లేని పత్తి విత్తనాలు విక్రయిస్తున్నాడన్నా సమాచారం మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి జనార్దన్ పోలీస్ బృందంతో తనిఖీలు నిర్వహించారు. సుమారు రూ.1,80,000 విలువ గల మూడు క్వింటాళ్ల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం విత్తనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేని విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గుంతలమయంగా గ్రామీణ రోడ్లు

- కంకర తేలి అవస్థలు పడుతున్న వాహనదారులు
- గ్రామీణ రోడ్లపై ధ్యాస మరిచిన యంత్రాంగం
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు



కంకర తేలి అధ్వానంగా ఉన్న జూరాల ప్రాజెక్ట్ రోడ్డు

**ధరూరు:** గ్రామీణ ప్రాంత బీటీరోడ్లు గుంతలమయంగా మారి పల్లెవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని చెప్పే పాలకులు అదే పల్లెలకు వెళ్లే రోడ్లను మరిచారు. ఐదారేళ్లుగా రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు వంటి వాటిపై దృష్టి సారించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

**పేరుకే బీటీరోడ్లు**

మండలంలోని పలు గ్రామాల్లో పేరుకే బీటీరోడ్లు అన్నట్లు కనిపిస్తోంది. ఎప్పుడో దశాబ్దాల క్రితం నిర్మించిన బీటీరోడ్లు భారీ వాహనాలు తిరిగి గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారయ్యాయి. ముఖ్యంగా ధరూరు– జూరాల ప్రాజెక్టు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారిందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ రోడ్లను బాగుచేసి రవాణా మెరుగు పరచాలని జీరుబండ, మన్నాపురం, సోంపురం, పారుచర్ల, గుర్రోనిపల్లి, దోర్నాల తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**తప్పని ఇబ్బందులు**

మండల పరిధిలోని ప్రజలు బీటీరోడ్లపై వెళ్లాలంటే నరకం చూస్తున్నట్లు వాపోతున్నారు. మండల పరిధిలోని జీరుబండకు చెందిన వారు చింతరేవుల లేదా వామన్‌పల్లి గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఎటు వెళ్లినా మూడు కి.మీ దూరం నడిచి రోడ్డు మార్గాని చేరుకుంటున్నారు. గర్రోపల్లి వాసులు ఎక్కిడికి వెళ్లాలన్నా ధరూరు చేరుకోవాల్సిందేనని, దాదాపు నాలుగైదు కి.మీ కాలి నడక తప్పడం లేదంటున్నారు. కాపులకుంట ప్రజలు 3 కి.మీ దూరంలో ఉన్న రాయచూరు రోడ్డుకు వెళ్లి ప్రయాణాలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. మండల పరిధిలోని సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని, అదే విధంగా అధ్వాన్న స్థితిలో రోడ్లకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

**కాలినడకే దిక్కు**

మన్నాపురం గ్రామం నుంచి ఎక్కడికి వెళ్లాలన్నా కనీసం బస్సు సౌకర్యం లేదు. రోడ్డు కంకర తేలి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పిల్లల చదువుల కోసం చాలా మంది గద్వాల, ధరూరు వంటి ప్రాంతాలకు వెళ్లి ఉంటున్నారు. తక్షణమే రోడ్లకు మరమ్మతులు చేయాలి.

– ఆర్‌టీసీ భీమన్న, మన్నాపురం

**నిధులు లేవు**

ఆయా గ్రామాలకు సంబంధించి బీటీరోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే రోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నాం. పూర్తిగా ధ్వంసమైన రోడ్లకు తాత్కాలిక మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, ఏఈ పంచాయతీ రాజ్ శాఖ ధరూరు



కోరుకండయ్య గట్టు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలో నిలిచిన వర్షపు నీరు



మన్నాపురం వద్ద బురదమయంగా మారిన జూరాల డ్యాంకు వెళ్లే రోడ్డు

## యూరియా అందుబాటులో ఉంచాలి



**మానవపాడు:** పీఏసీఎస్‌లలో రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు యూరియా ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలన్నారు. గోదాంలో డీఏపీ 6.15 టన్నులు నిల్వ ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ ప్రభాకర్‌నాయుడు, సాయికుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అవగాహన



**ఉండవెల్లి:** మండలంలోని తక్కశీల గ్రామంలో పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై అవగాహన మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత బెట్టింగ్ జోలికి పోకుండా తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థపై వివరించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కేశవరావు, కళాజాత బృందం పాల్గొన్నారు.

## పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మావతి

**అలంపూర్:** గ్రామీణ మహిళలను స్వయం సహాయక బృందాలతో పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. పట్టణంలోని మహిళా సమాఖ్య భవనంలో స్వయం సహాయ బృందాలతో పారిశ్రామిక రంగంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఆంట్రపెన్యూర్ ఆఫ్ ఇండియా ప్రపంచ బ్యాంక్ నిధులతో కేంద్ర ప్రభుత్వం రైసింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్మారెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థల సంయుక్త అధ్వర్యంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు 15 రోజులు పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తులు, మార్కెటింగ్ మెళకువలు, నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమలకు రిజిస్ట్రేషన్, బ్యాంక్ సహాయం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిజినెస్ కౌన్సిలర్ మహాలక్ష్మి, ఏపీఎం ప్రవీణ, సీసీ విజయలక్ష్మి, రూప, శాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో తాయమ్మకు పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

**అయిజ:** మండలంలోని నౌరోజీ క్యాంపు గ్రామంలో మంగళవారం గ్రామ దేవత తాయమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో 40 రోజుల అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహానికి పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భద్రయ్య, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంకాపురం రాముడు, బీఆర్ఎస్ నాయకులు చిన్నరాముడు, మల్లేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం



అమరవాయిలో సామూహిక అక్షరాభ్యాసంలో సూపర్‌వైజర్ వాసంతి



పల్లెపాడులో సామూహిక అక్షరాభ్యాసంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ

**మల్దకల్:** మండలంలోని అమరవాయి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిన్నారులకు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు యశోదమ్మ, తిమ్మమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి**

**మానవపాడు:** మండలంలోని పల్లెపాడు గ్రామంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ–2లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, సత్యరెడ్డి, హెచ్ఎం సురేష్, టీచర్ మాధవి, మౌనికమ్మ తదితరులు ఉన్నారు.

## ప్రధాని మోదీ హయాంలోనే దేశాభివృద్ధి



ఎర్రవల్లిలో మాట్లాడుతున్న రామాంజనేయులు

**ఎర్రవల్లి:** ప్రధాని నరేంద్ర మోదీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన విజయసంకల్ప సభకు హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 11 సంవత్సరాల పాలనలో అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రవి, శ్రీనివాసరెడ్డి, మహేష్, నరేష్, మహేంద్ర, జనార్దన్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఇటిక్యాల:** ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు దేవదాసు అన్నారు. మండలంలోని నక్కలపల్లిలో బీజేపీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దులా ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, గోవిందు, మహేంద్ర వీరన్న, మహేష్ పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక

**ఎర్రవల్లి:** రాష్ట్రంలోని పలు క్రీడా పాఠశాలల్లో 2025– 26 విద్యా సంవత్సరానికి నాల్గవ తరగతిలో ప్రవేశానికి బుధవారం కొండేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని విద్యార్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ అమీర్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లాస్థాయిలో ఈ నెల 23 నుంచి 26 వరకు, రాష్ట్రస్థాయిలో జూలై 1 నుంచి 5 తేదీ వరకు ఎంపికలు ఉంటాయన్నారు. తొమ్మిది విభాగాల్లో 27 మార్కులకు ఫిజికల్ టెస్టు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**రేపు జిల్లాస్థాయి ఎంపికలు**

**ధరూరు:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో మంగళవారం మండల పరిధిలోని ఆయా పాఠశాలల హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో ఎంపికలో భాగంగా 4వ తరగతి విద్యార్థులకు ఈ నెల19న గురువారం మండల కేంద్రంలో జరిగే ఎంపికకు విద్యార్థులను తీసుకురావాలని ఆదేశించారు. తొమ్మిది క్రీడా అంశాలతో కూడిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన 20 మంది బాలబాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

**మల్దకల్:** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్ఐ నందికర్ అన్నారు. మంగళవారం మండలంలోని మద్దెలబండ గ్రామంలో పది, ఇంటర్ పరీక్షల ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, నారాయణతో కలిసి హాజరయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జయమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

**అయిజ:** పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మేడికొండలో గ్రామంలో పేకాట స్థావురంపై దాడి చేసి రూ.12,800 నగదు, మూడు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని 7 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ఇటిక్యాల:** పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల ఆయుష్ శాఖ వైద్యాధికారి ముబీనా తబసుమ్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో యోగా దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా మంగళవారం హెల్త్ అవేర్‌నెస్, సురక్షిత తాగునీరు, కంటిచూపు, చేతి పరిశుభ్రత, రక్తహీనత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంచి ఆరోగ్యం కోసం బ్యాలెన్స్‌డ్ ఆహారం ఎంత ముఖ్యమో.. వ్యాయామాలు కూడా అంతే అవసరమని సూచించారు. సూర్య కాంతిలో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మమత, యోగా బోధకులు నరేష్, శివాని, హెచ్‌సీ బీసన్న తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలి



మురుగు తొలగిస్తున్న సిబ్బంది

**అయిజ:** మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో పారశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మున్సిపాలిటీలోని వివిధ వార్డులను అధికారులతో కలిసి పరిశీలించారు. 10వ వార్డులోని దుర్గానగర్ కాలనీలో మురుగును కార్మికులు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలను నివాసయోగ్యమైన, పర్యావరణ అనుకూల నగరాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తుందన్నారు. ప్రతిరోజు 'ఒక చర్య.. ఒక మార్పు' నినాదంతో సిబ్బంది పని చేయాల్సి ఉంటుందన్నారు. ప్రజల భాగస్వామ్యాన్ని సమ్మిళితం చేసి నూతన మౌలిక సదుపాయాలు కల్పించి, కొత్త ఆవిష్కరణలతో సుస్థిరమైన పట్టణ అభివృద్ధి సాధించడమే వంద రోజుల ప్రణాళిక ముఖ్య లక్ష్యమన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టణ ప్రజలతో మమేకమై పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నిషేధిత కవర్లు పట్టివేత**

మున్సిపాలిటీలో కొత్త బస్టాండ్‌లో సాయిప్లాస్టిక్ దుకాణం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు మంగళవారం దాడులు నిర్వహించారు. దుకాణంలో నిల్వ ఉంచిన సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే 1000 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రసవాల సంఖ్య మరింత పెంచాలి



మాట్లాడుతున్న వైద్యురాలు సర్వూపరాణి

**మల్దకల్:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలని వైద్యురాలు స్వరూప రాణి వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళ కార్యక్రమంపై గ్రామాల్లో తెలియజేయాలన్నారు. ముఖ్యంగా గర్భిణులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలన్నారు. అదే విధంగా మల్దకల్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యురాలు జయమ్మ తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మిట్టదొడ్డిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులు



కేటీదొడ్డిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ హరికృష్ణ

**మానవపాడు/కేటీదొడ్డి/ధరూరు/ఎర్రవల్లి/గట్టు:** భూ భారతి చట్టం అమలులో భాగంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ అన్నారు. మానవపాడు మండల పరిధిలోని పల్లెపాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పాస్‌బుక్‌లో సవరణ, తదితర సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. పల్లెపాడు– 15, చందూరు– 39, మంగమ్‌పేట– 6 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ కరుణకార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- గ్రామస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి కీలకం కానుందని గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు అన్నారు. కేటీదొడ్డి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ హరికృష్ణతో కలిసి నిర్వహించారు. అదే విధంగా రైతువేదికలో వివిధ గ్రామాల రైతులు నుంచి మండల వ్యవసాయ అధికారి సాజీద్ రెహమ్మాన్ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, ఆర్ఐ అశోక్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.
- ధరూరు మండల పరిధిలోని జాంపల్లి, భీంపురం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 23 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ అలివేలు మంగమ్మ, సీనియర్ అసిస్టెంట్ తిరుమలేష్, ఆర్ఐ తేజ తదితరులు పాల్గొన్నారు.
- గట్టు మండల పరిధిలోని మిట్టదొడ్డి గ్రామంలో తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 46 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.
- ఎర్రవల్లి మండల వ్యాప్తంగా 11 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించినట్లు తహసీల్దార్ నరేష్ తెలిపారు. రైతుల నుంచి మొత్తం 204 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. మండలంలోని కారుపాకుల గ్రామంలో చివరిరోజు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కేవలం మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.